క్లుప్తంగా

నైపుణ్యాలు పెంచుకోవాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వీసీ శ్రీనివాస్ సూచించారు. పీయూలోని జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం విద్యార్థులు రెండో సంవత్సరం విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులు పూర్తైన వెంటనే ఉద్యోగ అవకాశాలను పొందేవిధంగా సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్ బాబు, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఓడీ వేణు, గురుస్వామి, లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌యూబీ నుంచి వరద నీరు, బురద తోడివేత



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు స్థానిక బండమీదిపల్లి నుంచి పాలిటెక్నిక్ కళాశాల వైపు వెళ్లే దారిలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) కింద వరద నీరు బురదగా మారి 2 ఫీట్ల మేర నిలిచిపోయింది. దీంతో వాహనదారులతో పాటు పాదచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని స్థానికులు వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తెచ్చారు. స్పందించిన వారు శనివారం అక్కడికి వెళ్లి మోటార్లతో వరదనీటిని బయటకు తోడేశారు. అలాగే ఇదే మార్గంలో ఉన్న మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీని సైతం బాగు చేయించారు. ఈ పనులను మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. చివరకు ఈ ఆర్‌యూబీ నుంచి అటు, ఇటు యథావిధిగా రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

'రియల్' అభివృద్ధికి కృషి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి కృషి చేయాలని కన్సడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ఇండియా(క్రెడాయ్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెక్కం రాంరెడ్డి అన్నారు. శనివార స్థానిక సంఘం కార్యాలయంలో క్రెడాయ్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెరుకుపల్లి రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా రాఘవేందర్‌గౌడ్, మణిదీప్, అబ్దుల్ ఖదీర్, బోగా కోదండపాణి, ప్రధాన కార్యదర్శిగా కడుదాస్‌రాజేశ్, జాయింట్ సెక్రటరీలుగా కృష్ణబాబు, మహమ్మద్‌సిరాజ్, తిరుపతిరెడ్డి, ట్రెజరర్‌గా మణ్యంరెడ్డి, ఈసీ సభ్యులుగా రాంచందర్‌రావు, రాజ్‌కుమార్‌రెడ్డి, మయూర్‌పటేల్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు.

ఓ..మై ఫ్రెండ్..!

● నేడు స్నేహితుల దినోత్సవం

పాలమూరు/నవాబుపేట్/చిన్నచింతకుంట: రక్తం పంచుకుపుట్టిన తోబుట్టువులు జీవితాంతం తోడుంటారో లేదో కాని.. స్నేహితులు మాత్రం మన నీడలా మనవెంటే ఉంటారు.. చిన్న ఆపద వచ్చినా ఆదుకుంటారు. నేనున్నానని ధైర్యం నింపుతారు. అందుకే వారిని ఏడాదిలో ఒక్కసారైనా స్మరించుకోవడం మన ధర్మం. అందుకే ఏటా ఆగస్టు మొదటి ఆదివారాన్ని ఫ్రెండ్‌షిప్ డేగా నిర్వహిస్తున్నారు. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా 'సాక్షి' కొందరిని పలకరించగా.. మనోభావాలు వారి మాటల్లోనే..

స్వార్థం ఉండదు



స్నేహంలో ఎలాంటి స్వార్థం ఉండదు. ప్రతిఒక్కరి జీవితంలో స్నేహితులు ఉంటారు. స్నేహం గొప్పవరం. కష్ట సుఖాలు, ఆపదలో, జీవిత లక్ష్యాలను నెరవేర్చడంలో తోడు ఉంటుంది. భవిష్యత్‌కు మార్గనిర్దేశంగా నిలుస్తుంది. ఎలాంటి సమస్య వచ్చినా ముందు ఉండేది స్నేహితులే. తల్లిదండ్రులతో పాలుపంచుకోలేని విషయాలు స్నేహితులతో పంచుకుంటాం. నా జీవితంలో బాల్యం నుంచి నాకు ఒక బెస్ట్ స్నేహితురాలు ఉన్నది. అది నా అదృష్టం. నాకు వెన్నంటి ఉండి అన్ని విషయాల్లో తోడ్పాటునందిస్తూ నన్ను ముందుకు నడిపిస్తుంది. – భార్గవి, నెల్లికొండి, చిన్నచింతకుంట మండలం

స్నేహంటే నమ్మకం



స్నేహమంటే అవసరం ఉందని చేసి తీరా అవసరం తీరాక దాన్ని వదిలేయడం కాదు. స్నేహం అనేది టైరపాస్‌కు కాదు. పైగా విందులు, షికార్లు చేసేందుకు మాత్రమే చేసేది స్నేహం ఎంతమాత్రం కాదు. ఆనందం వచ్చినా.. ఆపద వచ్చినా వెన్నంటి ఉండేదే స్నేహం. అలాంటి స్నేహం పాలకంటే పవిత్రమైంది. తల్లిదండ్రులతోపాటు అన్ని విషయాలు షేర్ చేసుకునే స్థాయికి ఒక మూడో వ్యక్తి వచ్చాడంటే స్నేహంపై ఉన్న నమ్మకంతోనే. అందుకు స్నేహం అంటే నమ్మకం. – సాత్విక్, నవాబుపేట

అభివృద్ధికి అందరితో కలిసి పనిచేస్తా

● ఎంపీ డీకే అరుణ
● వస్పుల పాఠశాలలో సైన్స్‌ల్యాబ్, అదనపు గదుల ప్రారంభం

మిడ్జిల్: పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధికి అందరితో కలిసి పనిచేస్తానని ఎంపీ డీకె అరుణ అన్నారు. శనివారం మిడ్జిల్ మండలంలోని వస్పుల ఉన్నత పాఠశాలలో దాదాపు రూ.27లక్షల పీఎం శ్రీ నిధులతో నిర్మించిన సైన్స్ ల్యాబ్, అదనపు గదులను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కావాల్సిన మౌలిక సదుపాయలను కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని పెద్దాయిపల్లిలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి కోసం పార్టీలను పక్కనబెట్టి పనిచేస్తానన్నారు. అలాగే వస్పులలో పీహెచ్‌సీ ఉపకేంద్రం నిర్మాణానికి ఎంపీతో కలిసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, తహసీల్దార్ యూపీ రాజు, ఎంపీడీఓ గీతాంజలి, ఎంఈఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



వస్పులలో పీహెచ్‌సీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

పదేళ్ల రాష్ట్రాన్ని కేసీఆర్ దోచేశారు

పాలమూరు: పదేళ్ల తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ పూర్తిగా దోచుకున్నాడని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేబాటలో నడుస్తుందని ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కొత్తగంజ్ పోచమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఓబీసీ జిల్లా నాయకుడు యాదయ్య ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ పెద్ద నర్సింహులతోపాటు కొంతమంది యువత ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పద్మజారెడ్డి, బాలరాజు, రాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

● కలెక్టర్ విజయేందిర



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

భూత్పూర్: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ సుగుణశ్రీని కలెక్టర్ వియజేందిర బోయి ఆదేశించారు. శనివారం అమిస్తాపూర్ సమీపంలోని రాజీవ్ స్వగృహాల్లో జ్యోతిబాపూలే బాలికల గురుకుల బీసీ సంక్షేమ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం విద్యార్థినులకు అందిస్తున్నారా, ఆహార విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అనంతరం స్టోర్ రూం, కిచెన్ గది, డైనింగ్ హాల్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వసతులు, భవిష్యత్ ప్రణాళికలతో కలెక్టర్ ముచ్చటించారు. సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థినులను గుర్తించి ప్రత్యేక బోధన అందించాలని, మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని, ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని హితవు చెప్పారు.

చెక్‌డ్యాం నిర్మాణంలో నాణ్యత కరువు

● ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



చెక్ డ్యాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్: మండలంలోని వస్పుల దుందుబీ వాగులో 2019లో బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన చెక్ డ్యాం 6ఏళ్లు పూర్తికాకముందే తెగిపోయిందంటే నాణ్యత ఎలా ఉందో అర్థమవుతుందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక నాయకులు, రైతులతో కలిసి చెక్‌డ్యాంను పరిశీలించారు. బీఆర్‌ఎస్ హయాంలో కమీషన్లు తీసుకొని పనుల నాణ్యతను గాలికి వదిలేశారని విమర్శించారు. తెగిన చెక్‌డ్యాం నిర్మాణానికి నిధులను కేటాయించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. అధికారులు నివేదికలను తయారు చేయాలని సూచించానమని, నివేదికలు వచ్చిన తర్వాత నూతన చెక్‌డ్యాం నిర్మాణం చేపడుతామని తెలిపారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ జ్యోతి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లపై పల్లెవెలుగు బస్సులు నిలపాలి

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ వద్ద సర్వీస్ రోడ్లపై ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులను నిలిపేవిధంగా అధికారులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్ డిపో వద్ద అసిస్టెంట్ మేనేజర్ రామ్‌జీని కలిసి వినతిపత్రం అందజేశారు. శాఖాపూర్ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులను నిలపడం మూలంగా వృద్ధులు, మహిళలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల కోసం గ్రామస్తులు సర్వీస్ రోడ్లపై వేచి చూస్తుంటే కొన్ని బస్సులను డ్రైవర్లు జాతీయ రహదారిపై నిలుపుతున్నట్లు వివరించారు. వృద్ధులు, మహిళలు, పాఠశాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో రెండు చోట్ల బస్సులను నిలిపేవిధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, శివకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, సయ్యద్ ఖలీల్, రాఘవేందర్, భాస్కర్‌గౌడ్, భీమార్జున్, రాజేశ్‌సాగర్, చెన్నసాగర్ ఉన్నారు.

ఓటుహక్కు ప్రాధాన్యత తెలియాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజాస్వామ్యంలో ఓటు విలువపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు స్కూల్ ఎన్నికలు నిర్వహించినట్లు శ్రీ చైతన్యం ప్రిన్సిపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం శ్రీ చైతన్యం స్కూల్‌లో అండర్ స్కూల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులు తమ ఓటును వినియోగించుకున్నారు. హెడ్‌బాయ్స్, హెడ్ గర్ల్స్, డిప్యూటీ హెడ్ బాయ్స్, డిప్యూటీ హెడ్ గర్ల్స్‌కు జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ రఘుబాబు, డీన్ మహేశ్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి చానొషిన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధక శక్తి



మహబూబ్‌నగర్ రూరల్: తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిపాలతో బిడ్డలు మానసికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఎదుగుదలకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో మహిళా శక్తి ప్రతినిధి అరుణ, ఏఎస్ఎం శివశంకరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, లక్ష్మి, స్వప్న, హిమబిందు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రవూఫ్‌బాబా ఉర్సే షరీఫ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం వీరన్నపేటలో హజ్రత్ సయీద్ మహ్మద్ రవూఫ్‌బాబా దర్గా ఉర్సే షరీఫ్‌ను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి గుస్లే షరీఫ్‌ను నిర్వహించారు. అనంతరం జరిగిన ధార్మిక సదస్సులో మతపెద్దలు పాల్గొని సందేశాలు ఇచ్చారు. అదేవిధంగా శనివారం రాత్రి ఉర్సులో ప్రధాన ఘట్టమైన గంధోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ఊరేగించారు. దర్గాలో పూలు, ఛాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ గఫూర్ నియాజీ, ఆలిండియా సున్ని ఉల్మా మషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహసిన్‌పాష ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్!

● ఇందిరమ్మ కమిటీలకు సమాచారం ఇవ్వని అధికారులు
● తూతూమంత్రంగా అవగాహన సదస్సు



హాజరైన ఇందిరమ్మ కమిటీ మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు

గండేడ్: ఇందిరమ్మ కమిటీలు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సు తూతూమంత్రంగా నిర్వహించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మేస్త్రీలు అధిక డబ్బులు తీసుకుంటున్నారని.. ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారితో మాట్లాడి తక్కువ డబ్బులు ఇచ్చేలా చూడాలని.. అందుకు కమిటీకి తగిన అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సంయుక్తంగా ఎంపీడీఓ సత్యహరిశ్చంద్రారెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కాని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులకు ఎవరికీ సరైన సమాచారం లేదు. మండలంలో 27 జీపీలుండగా.. మొత్తం 135మంది ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉన్నారు. అవగాహన సదస్సుకు 20మందికి మించి హాజరుకాలేదు. పంచాయతీ కార్యదర్శులు కూడా పూర్తిస్థాయిలో హాజరుకాలేదు. సమావేశం ప్రారంభించిన కొద్దిసేపట్లోనే ముగించి మమా అనిపించారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా.. గ్రామానికి ఒక ఇందిరమ్మ కమిటీ సభ్యులను సమావేశానికి తీసుకురావాలని కార్యదర్శులకు చెప్పామన్నారు. అందరినీ పిలిస్తే సమావేశం నిర్వహించేందుకు ఇబ్బంది కలుగుతుందని అలా చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, హౌసింగ్ డీఈ పుష్పలత, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చక్రధరం సేవలు మరువలేనివి

● ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ శ్రీధర్
● జిల్లా ప్రజల అభిమానాన్ని మరవలేను
● ఇరిగేషన్ సీఈ చక్రధరం



ఇరిగేషన్ సీఈ చక్రధరంను గజమాలతో సన్మానిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నీటి పారుదల శాఖలో ఇంజనీర్‌గా సుదీర్ఘకాలంలో పనిచేసిన సీఈ చక్రధరం సేవలను ఎప్పటికీ మరువలేమని ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ శ్రీధర్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇరిగేషన్ సీఈ చక్రధరం ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ.. అందరితో కలిసిమెలసి సున్నితంగా పనిచేయించుకునేవారన్నారు. నీటి పారుదల శాఖకు ఆయన చేసిన సేవలు జిల్లా ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. అనంతరం సన్మాన గ్రహీత చక్రధరం మాట్లాడుతూ.. నాతోటి అధికారులు, సిబ్బంది తనకు సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై జిల్లా ప్రజలు చూపిన అభిమానాన్ని ఎప్పటికి మరిచి పోనన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ ఉదయ్‌శంకర్, ఈఈలు దయానంద్, లక్ష్మణ్, ప్రతాప్‌సింగ్, ఏఈలు బాలకృష్ణ, దీవెనమ్మ, పార్వతమ్మ, ఇతర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటసాగుపై జాగ్రత్తలు తీసుకోవాలి

మహమ్మదాబాద్: పంటసాగుపై రైతులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ నరేందర్ తెలిపారు. శనివారం మండలంలోని గాధిర్యాల్, నంచర్లలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంటపై కాండంతొలుచు పురుగు కత్తెరపురుగు ఆశించి ఎంతో నష్టపరుస్తుందని తెలిపారు. వరినారు మడి పెంచుకునే పద్ధతి.. నాటు వేసే పద్ధతి మందుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

బీసీ రిజర్వేషన్లపై చలో ఢిల్లీ

దేవరకద్ర: బీసీ రిజర్వేషన్ల సాధనకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల నాయకులు రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తూ పంపిన బిల్లు ఆమోదమే లక్ష్యంగా చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌ఈఎస్‌బీ కార్యదర్శిగా భాస్కర్‌యాదవ్



స్టేషన్ మహబూబ్‌నగర్: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ మహబూబ్‌నగర్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఇటీవల జోన ల్ కార్యదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య ప్రకటించారు. బ్రాంచ్ కార్యదర్శిగా భాస్కర్ యాదవ్, చైర్మన్‌గా రాజు, వర్కింగ్ చైర్మన్‌గా రవికిరణ్, ఉపాధ్యక్షులుగా వెంకటేశ్, శ్రీనివాస్, వేణుగోపాల్, అసిస్టెంట్ కార్యదర్శులుగా మోహన్, తిరుపతయ్య, సింహాచలం, కోశాధికారిగా రాములును ఎన్నుకున్నారు.

విద్రోహక దినోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

గండేడ్: సీపీఎస్ విద్రోహక దినోత్సవంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెన్నాచేడ్, కప్లాపూర్, సల్కర్‌పేట్, గండేడ్ తదితర పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎస్ అంతం పీఆర్‌టీయూ పంతం అని తెలియజేస్తూ సెప్టెంబర్ 1న విద్రోహక దినంగా ప్రకటించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇందిరా పార్కువద్ద జరిగే కార్యక్రమానికి ప్రతి ఉపాధ్యాయుడు హాజరై ప్రభుత్వం అంగీకారం తెలిపే వరకు పోరాటం చేయాలన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు బాదేపల్లి విద్యార్థులు



జడ్చర్ల టౌన్: సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ పోటీలకు బాదేపల్లి బాలుర జెడ్పీహైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు పూజ, హిందు, వైష్ణవి ఎంపికైనట్లు హెచ్‌ఎం చంద్రకళ శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఆదివారం నుంచి మూడురోజులపాటు జరిగే టోర్నీకి హాజరయ్యేందుకు బయలుదేరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీడీ వడెన్న, రాంకళ్యాణ్, స్టాఫ్ సెక్రటరీ గోపాల్, ఉపాధ్యాయులు సునీల్ అభినందించారు.

31 పూర్వవిద్యార్థుల సన్నాహక సమావేశం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశాన్ని ఈనెల 31న పట్టణంలోని చంద్రగార్డెన్‌లో నిర్వహించనున్నట్లు పాఠశాల శతాబ్ది ఉత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. పాఠశాల వందేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా నవంబర్ 27, 28, 29 తేదీల్లో నిర్వహించే శతాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. హెచ్‌ఎం చంద్రకళ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు శతాబ్ది ఉత్సవాల నిర్వహణలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పూర్తిగా సహకరిస్తుందన్నారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, ఉపాధ్యక్షులు ఇబ్రహీం పాల్గొన్నారు.

విద్యార్థులపై ఆప్యాయతను చూపించాలి

మహమ్మదాబాద్: నిత్యం బోధించే ఉపాధ్యాయులు విద్యార్థులతో తల్లిదండ్రుల ఆప్యాయతను చూపించాలని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కౌసర్‌జహాన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ బదిలీపై వెళ్లడంతో గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ బదిలీపై వెళ్లిన గుండుమాల్‌లోని కొత్త కళాశాలలో కూడా మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజు నాయక్, హెచ్‌ఎం పాండురంగారెడ్డి, షష్ట్యాబ్ది స్టూడెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌రెడ్డి, సభ్యులు రాంలాల్, రాజేశ్వర్, రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అనంతయ్యగుప్తా, బాల్‌రాజ్‌గౌడ్, రాములు, వేణుగౌడ్ పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న షష్ట్యాబ్ది కమిటీ

మౌంట్‌బాసిల్‌లో విద్యార్థి మంత్రి మండలి ఎన్నికలు



స్కూల్ కేబినెట్ ఎన్నికల్లో పోటీచేసిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రం సమీపంలోని మౌంట్‌బాసిల్ పాఠశాలలో శనివారం విద్యార్థి మంత్రి మండలి (స్కూల్ కేబినెట్) ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మాక్‌పోలింగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓట్లు వేశారు. మౌంట్‌బాసిల్ పాఠశాలలో శనివారం ఘనంగా విద్యార్థి మంత్రి మండలి ఎన్నికలను నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల నిర్వహణకు సంబంధించి హెడ్‌గర్ల్, హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ బాయ్, హౌస్ కెప్టెన్, డిప్యూటీ హౌస్ కెప్టెన్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి, అంబియన్స్ ఇన్‌చార్జి, డిసిప్లెన్ ఇన్‌చార్జి, కల్చరల్ ఇన్‌చార్జి వంటి పోస్టులకు ఓటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, డైరెక్టర్ శిరీష ప్రవీణ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఎలక్ట్రానిక్ పరికరాలతో సార్వత్రిక ఎన్నికల విధానాన్ని తలపించేలా పోలింగ్ జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ సోమశేఖర్ మాట్లాడుతూ పాఠశాలలో ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేలా పోలింగ్ సరళి జరిగిందని, ఇందులో 95 శాతం విద్యార్థులు ఓట్లు వేశారని పేర్కొన్నారు. ఆగస్టు 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పూజిత మోహన్‌రెడ్డి, సుశాంత్‌కృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అడ్డాకుల ఏపీఎంగా మహేశ్

అడ్డాకుల: మండలంలో ఏపీఎంగా పనిచేస్తున్న సుధీర్‌కుమార్ ఇటీవల భూత్పూర్ మండలానికి బదిలీ అయ్యాడు. ఆయన స్థానంలో జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలో ఏపీఎంగా పనిచేస్తున్న మహేశ్‌ను అడ్డాకులకు కేటాయించడంతో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వీఓఏల యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఏపీఎంకు స్వాగతం పలికి సన్మానం చేశారు. కార్యక్రమంలో సీసీలు శ్రీహరి, రాజు, సురేశ్, అరుణ, వీఓఏల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

దేవరకద్ర: మండలంలోని గుడిబండ ప్రాథమికోన్నత పాఠశాలలోని 80మంది విద్యార్థులకు శనివారం గూంజ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, నోటు బుక్కులు, కాంపాక్స్‌లు, పెన్సిల్లు అందజేశారు. అదేవిధంగా అంగన్‌వాడీలో చదివే 90మంది చిన్నారి బాలబాలికలకు ఆట వస్తువులు, బొమ్మలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు అనిల్‌కుమార్, రవిప్రకాశ్‌రెడ్డి, కుర్మయ్య, సత్యనారాయణ, శివరాజు, శ్రీనుచారి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటింటికీ బీజేపీ

దేవరకద్ర: మండలంలో ఆదివారం నుంచి మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం ప్రారంభమవుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు గోప్లాపూర్, 4వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు గూరకొండలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

దాతలు ముందుకు రావాలి

చిన్నచింతకుంట: సీసీకుంట మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో సీసీ కెమరాల ఏర్పాటుకు దాతలు ముందకురావాలని ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ కోరారు. కొందరు భక్తుల రూపంలో ఆలయాలకు ప్రవేశించి చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. సీసీ కెమరాలు ఏర్పాటు చేస్తే చోరీలను అరికట్టవచ్చని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నిఘానేత్రాలుగా పనిచేస్తాయని తెలిపారు. దాతలు ముందకొచ్చి సీసీ కెమరాల ఏర్పాటుకు తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా గరుడోత్సవం

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండో శనివారం పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నకేశవ స్వామి, శ్రీదేవి భూదేవి సమేతంగా గరుడోత్సవం నిర్వహించారు. భజన బృందం ఆధ్వర్యంలో గరుడ వాహనంపై కొలువుదీరిన స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. గోవిందనామస్మరణతో భజన బృందం సభ్యులు వీధుల్లో తిరిగారు. పలువురు భక్తులు గరుడోత్సవాన్ని చూడడానికి పెద్ద ఎత్తున తరలి వచ్చారు.